# దాగుడు మూతలు

శ్రీ "రంగారావ్"

జీవితం—సంఘానికీ, దానికట్టుబాట్లకూ ప్రతిబింబం. మనసు ఆలోచనకూ, ఆలోచన ఆచరణకూ ఆధారం.

జీవితం అన్న ఘట్టంమీద మనస్సనే కాంతి రేఖ ప్రసరించినపుడు అది పరావర్తనం చెంది—తమ మధ్య వివిధవర్ణాల నిముడ్చుకున్న 'మంచీ—చెడూ' అన్న కిరణాలుగా పరిణామం చెందుతుంది.

మంచీ—చెడూ అన్నవి తరతరాలమీద ఆధారపడిన విశేష్యాలు; సరిహద్దులేని విభాగాలు; 'ఆల్జీబ్రా'లోని 'ఎక్స్', వై'ల రూపాంతరాలు. ఆ రెంటిలో దేనికీ స్వయం సంపూర్ణతలేదు. వాటిలో ఏది ఎక్కడ అంతమయి, ఎక్కడ రెండోది ఆరంభమవుతుందో చెప్పడానికి వీల్లేదు. ఆ రెండూ సముద్రపు అలల్లాగా కలిసిపోయి, నురుగులు కక్కుతూ, ఉరకలు వేస్తూ, పరుగులిడుతూ మానవుడి మస్తిష్కాన్ని మథిస్తుంటాయి.

మనం 'చెడు'ని చరిస్తూ 'మంచి'ని స్మరిస్తుంటాం. లేదా తలపుల కడుగున 'చెడు' పరుగెడుతున్నా చేతలు 'మంచి'వి చేస్తుంటాం. ఈ రెంటి నిమ్నోన్నతాల్లో ఇరుక్కుపోయి—అనుకున్నది చేయకా, చేసిందానిని గురించి అనుకోలేకా మథనపడుతుంటాం. కావలసిన దానిని చెప్పలేకపోతాం; చెబుతున్నదేదో అక్కర్లేకపోయినా వాచామాత్రం కావాలంటుంటాం. ఈ వెలుగు నీడల, దాగుడుమూతల సన్నివేశాన్ని ఊహించి, సాహసించి, ఛేదించడానికి సిద్ధమయేసరికి తెర జారుతుంది. ఆ కారణంచేతనే ఈ సంఘర్షణ నర్థంచేసుకుని ఈ వారిధికి వారధికట్టినవారు లరుదు. అలా ఈ బాటను దాటినవారు సాధారణానికీ, సామాన్యానికీ ఓ మెట్టు పైనివారు.

కానీ ఉషా, శర్మా ఈ ప్రవాహంలో ఈదలేక పోయారు; ఈ చీకటిలోనే కాలుజారారు.

తనలోని స్త్రీ సహజమైన మాతృవాత్సల్యానికి జోడుగా శర్మను దైవత్వాన్ని ఆపాదించి ఆరాధించింది—ఉష.

పురుష సహజమైన తన 'అహా'నికి ఉషని ఆహారంగా తీసుకుని, ఆమె జీవితవలయానికి తాను కేంద్ర మనుకుని, ఆమెలో శైశవత్వాన్నిమాత్రమే చూచాడు—శర్మ.

ఇద్దరూ కూడా ఒకరిలోని మానవత్వాన్ని మరొకరు—తాత్కాలికంగానే చాలు——మరచిపోయారు. ఉష శర్మలోని పురుషుణ్ణీ, అతడామెలోని స్త్రీనీ అలక్ష్యంగా గుర్తించారు

* * *

ఒకానొక జన—ప్రపంచం అరణ్యంగా, జీవితం ఎడారిగా అనిపించిన రోజున—బీచి కెళ్ళాడు శర్మ. అక్కడ—నేలా, నీళ్ళూ, నింగీ, నిరంతర క్రియమై దాగుడుమూత లాడుకుంటున్న—అక్కడ, ఒంటరిగా కూర్చుని నయాగరా జలపాతంలా కన్నీళ్ళు కారుస్తున్న ఉష కన్పించింది. ఇరవై నాలుగేళ్ళ ఆవిడ ముప్పైకన్న ఎక్కువ వసంతాలను చూచి వుండదనిపించింది. మత్స్యయంత్రాన్ని కొట్టబోతున్న అర్జునుడిలా శర్మదృష్టి ఆమెమీదను కేంద్రీకృతమయింది. 'ఏడుస్తున్న—ఆమె ఆ తెల్లచీర సరిపడలేదు. కనీసం ఆవిడ ఆ తెల్లచీరకట్టుకుని చేయవలసిన పని ఏడవడంకాదు. ఆమెలో భాష కందని ఆకర్షణ వుంది. ఆమె అందం ఆ ఆకర్షణలో ఒకభాగం మాత్రమే.' శర్మ మనస్సముద్రం ఆలోచనా తరంగాల ఆటుపోట్ల కాలవాలమయింది. "ఈమె ఎందుకిలా సముద్రంతో పోటీవేసుకుని ఇసుకను కన్నీటితో తడుపుతున్నది? ప్రపంచం ఈమెకేం అన్యాయం చేసింది?"

శర్మ ఆమెపక్క వెళ్ళి "ఏమండీ?" అన్నాడు. మరణం ప్రతిఫలిస్తున్న ఆమె కళ్ళల్లో భయానికీ, ఆశ్చర్యానికీ తావు లేకపోయింది.

"ఎందుకలా ఏడుస్తున్నారు?" తనెవరో ఇలా అడగడానికి—

"గుండెను ఎడారిచేసుకుందామని..." అంది ఆమె తడారిపోయిన గొంతుకతో.

"కారణం?"—ఈ ప్రశ్న శర్మ మళ్ళీ వేయవలసి వచ్చింది.

ఈ అపరిచితుడి కళ్ళల్లోని 'పిడికెడు' సానుభూతిని గుర్తించిందామె. ముగిసిన తన జీవితపు అధ్యాయాల పుటల్ని వెనక్కి తిప్పింది ఆమె.

ఐదేళ్ళ క్రింద భర్త చనిపోయిన నాటికి చేతిలో పదినెలల పాపాయిట. టీచరుపని చేస్తూ, ఉన్న కొడుకును పెద్దచేయాలన్నది ఆశయంగా, జీవితం వ్రతంగా, అయినవాళ్ళని కాదని ఒంటరిగా బతకడం మొదలిడిందిట. రెండు నెలల క్రితం బడిమేనేజరుకు తన శరీరాన్ని అర్పించడానికి నిరాకరిస్తే "నీ ఉపాధ్యాయినీత్వం అక్కర్లేదు పొమ్మ"న్నాట్ట. ఉద్యోగం పోయిన నెల రోజులకు కుర్రాడు పోయాట్ట. డబ్బుల్లేక మందులు సరిగా ఇప్పించక వాడిచావుకు తానే కారణమయానన్నది ఉష.

"నా శీలానికోసం నా బిడ్డను బలిఇచ్చాను. ఇపుడు నా ప్రాణానికే విలువలేదు. నా బ్రతుక్కు అర్థము ఆశ కూడా దూరమయాయి. అటువంటప్పుడు నేనెందుకోసం, ఎవరికోసం బతకాలి?" అని అడిగింది ఆమె.

శర్మ గుండె మండింది.

"ఒక ఘంట క్రితం మీ రెవరో నాకు తెలియదు. కాని ఇపుడు నాకు మీకన్న తెలిసినవాళ్ళు లేరు. ఎవరికోసం జీవించాలి—అన్నారు. జీవితం జీవితంకోసమే. క్షణికమైన దుఃఖభారంతో మనస్సుని అనువసనిసిగా చేసుకోవడం సహజమే. కాని వివేకం కాదు. జీవితలతకు సదా ఆధారంగా ఏదో ఒకటి వుండితీరాలి. ఒక వృత్తి, ఒక ఆశ, ఒక స్మృతి...దేన్నో ఆధారంగా తీసుకుని హేతువుకందనిరీతిలో సాగిపోతుంటుంది జీవితం; సాగిపోవాలి జీవితం. నాకెవరూ లేరు. నాతో పాటు రండి. మీ రేదయినా ఉద్యోగం సంపాదించవచ్చు. రండి. నన్ను నమ్మండి. నా మాట కాదనకండి." అన్నాడు శర్మ.

ఆమె హృదయం చిగుళ్ళు తొడిగింది.

*　　*　　*

రెండు నెలలు గడిచాయి.

ఆమె అతడూ ఒకే ఇంట్లో వేర్వేరు వాటాల్లో వుంటున్నారు. దినపత్రిక విలేకరిగా తనకున్న పలుకుబడిని వినియోగించి ఆమెకు ఒక బళ్ళో ఉద్యోగం ఇప్పించగలిగాడు శర్మ.

మొదట్లో ఉష కొంత బరువుగా దిగులుగా కన్పించేది. సంతోషంతో మాట్లాడుతూ మాట్లాడుతూ హఠాత్తుగా ఆగిపోయేది. ఆమె కళ్ళు కంటికందని దూరాలను చూచేవి. బడిలో అందరి పిల్లల్లో తన అబ్బాయి ఉన్నాడేమో, తనకోసం వెతుకుతున్నాడేమో...అన్న భ్రమ కలిగేది. శర్మ ఏదయినా చెబుతుంటే దీక్షతో వినడానికి మొదలిడేది. మధ్యలో మరి ఏమయేదో...

"ఏమండీ... నే చెబుతున్నది వినరేం?" అన్న శర్మ మందలింపు స్వరం వినపడేదాక మనసెగిరిపోయేది. కానీ, క్రమంగా ఆమె మామూలు వ్యక్తి అయింది. బళ్ళో ఆనందోత్సాహాలు వెల్లివిరిసే చిన్నపిల్లల మొహాలూ, క్రొత్తస్నేహాలూ, అన్నిటినీ మించి శర్మ ఆదరణా ఆమెలో జీవిత వాంఛను పునః ప్రతిష్ఠించాయి. సముద్రం ప్రక్కన శోకమే రూపంగా కన్పించిన ఉషలోని గంభీరమయిన ప్రశాంతతా, ఆకర్షణీయమయిన అమాయికతా, మల్లెపూలు మాటాడినట్లనిపించే ఆమెనవ్వూ ఇవన్నీ...శర్మ క్రమంగా తెలుసుకున్న గుణింతాలు. ఆమె నల్గురిలో ఒకతెగా ఉద్యోగం చేస్తూ జీవించడం శర్మకనిర్వచనీయమైన గర్వాన్నీ, సంతోషాన్ని కల్గించాయి. శర్మ ఆమెజీవితంలో తన జీవితానికి అర్థాలు వెతుక్కున్నాడు. అవి దొరికాయని మురిసిపోయాడు. శర్మయొక్క అపేక్ష, అధికారంతో కూడిన అనురాగమూ ఉషాదేవి మనసులోని అణాడి రూపం మీదను వింత కాంతులను వెదజల్లేవి. బడిలోని ప్రతిసంఘటనా, తను కలుసుకున్న ప్రతివ్యక్తి రూప గుణాలూ, ఒకపుడు తాను సరిగా ఇలాంటి పరిస్థితుల్లోనే ఏవిధంగా ప్రవర్తించిందీ... మొదలయిన విషయాలన్నీ శర్మకి ప్రతిరోజూ వల్లించేది ఉష.

ఆమెను అతడు పూర్తిగా తెలుసుకున్నాడు. కనీసం తెలుసుకున్నాననుకున్నాడు.

—ఒకరోజు పొద్దున తొమ్మిదిగంటలయింది. అలవాటు ప్రకారం నిరాడంబరంగా తన తెల్లచీరతో ఉష బడికి బయలుదేరింది.

"శర్మా...బడికి వెళ్తున్నా."

శర్మ మాట్లాడకుండా ఆవిడకేసి చూశాడు. ఆమె కళ్ళతో నవ్వింది. "చాల...బాగున్నారండీ!"

ఆమె మొహం గులాబీల గుత్తి అయింది...

"ఇదిగో శర్మా...నన్ను 'అండీ' అనవద్దు బాబూ అని మొత్తుకో లేదూ..."

"మరేమన మంటారండీ...?"

నిస్సహాయంగా నవ్వింది ఉష. "చాల అల్లరిపిల్లాడివి శర్మా...బాబోయ్ ఆ అమ్మాయి నీతో ఎలా వేగుతుందో కాని..." అంటూ వెళ్ళిపోయింది ఉష.

ఆ రోజు సాయంత్రం ఉష ఇంటికొచ్చేసరికి శర్మ తనగదిలో కుర్చీలో కూర్చుని రేడియో వింటున్నాడు. చేతిలో సిగరెట్టు పొగలు కక్కుతూంది.

"ఆఫీసుకు వెళ్ళలేదూ?" అని అడిగింది ఉష... గదినిండా పడివున్న సిగరెట్టు పీకల్ని కంటితో లెక్కపెడుతూ.

"ఊహు. తలనొప్పిగా వుంది."

"తలనొప్పా! రాదూ మరి.. ఇలా కూచుని వందలు వందలు సిగరెట్లు తగలెడితే తలనొప్పేమిటి... ఊపిరి తిత్తులు కాలిపోయి—"

"—నేను రైలింజన్ అయిపోతాను కదూ..." అని నవ్వాడు శర్మ చేతిలోని సిగరెట్టు పారేస్తూ...

"ఛీ ఛీ... అయినా నీలా జ్ఞానం వున్నవాడికి నేను చెప్పడమేమిటి? కాకపోతే శర్మా... అడిగే వాళ్లెంటూ లేరుకదా అని ఇలా డబ్బు పాడు చేసుకుని..." అని తీవ్రంగా మందలించబోయింది ఉష.

"ఇదిగో... ఇదిగో... అపుడే లెక్చర్ ఆరంభించారూ..." అని శర్మ ఎగతాళిగా బెదిరించేసరికి ఉష నీరసంగా నవ్వింది.

"నీ ఇష్టం బాబూ! నీకెవరు చెప్పగలరు.. అయితే ఇపుడు అలా వెళ్ళొద్దాం వస్తావా?"

"ఎక్కడికి?"

"ఏదైనా సినిమాకి వెళ్దామూ?"

"నేను రాను... మీరు వెళ్ళరండి..."

"నేనొక్కత్తెనా?... ఎపుడూ ఎక్కడికీ ఒంటరిగా వెళ్ళనుగా... ఆఖరికి హోటల్లోకయినా తోటి టీచర్లెవరయినా వస్తే తప్ప వెళ్ళను... నన్ను ఎందుకుగాని రా, శర్మా వెళదాం... అలా వెళ్ళితే నీ తలనొప్పి కొంత తగ్గుతుంది.. రా.. బయలుదేరు. రావూ.." అని ఉష అడుగుతుంటే తనని తాను వెయ్యొట్లె గుణించుకున్నా వద్దనలేననిపించింది శర్మకి.

"మీరు దారిలో నా సిగరెట్ల ఊసెత్తనని మాటిస్తే వస్తా." అంటూ బట్ట వేసుకోవడానికి ఉపక్రమించాడు.

బయలుదేరబోతూ హఠాత్తుగా ఒక్కక్షణం ఆగాడు శర్మ. ఆ ఒక్క క్షణంలోకి గతంలోని కొన్ని సంవత్సరాల సంఘటనలు కుదించబడ్డాయి.

—ఒకానొకప్పుడు... శర్మ—అమ్మా నాన్నా లేక వాళ్ళ మామయ్య ఇంట్లో పెరుగుతున్న ఓ అమ్మాయిని తన సహధర్మిణిగా ఎన్నుకున్నాడు. ముహూర్తం వారంరోజు లుందనగా, 'సంఘం'లోని 'నాగరికు'లయిన సోదరసోదరీమణుల నాలుకలు పాలవంటి మనసూ, నిప్పువంటి శీలమూ కల్గిన ఆ అమ్మాయి మనస్థైర్యానికీ, జీవితానికి మంగళం పాడాయి. లోకులు సునాయాసంగా ఆపాదించిన నింద నిరాధారమని రుజువుపరచడానికి తన నిష్క్రమణే మార్గమని నమ్మిందా అమ్మాయి. శర్మ ఆ వూరు చేరేసరికి అవనిక జారిపోయివుంది. మూడు నెలలపాటు శర్మ ఇవాళ వున్నచోట రేపుండక తిరిగాడు. హస్తులూ మళకాలూ భుజాలు రాసుకుతిరిగే హస్తినాపురంలోని ఇనప స్తంభానికీ, ఆగ్రాలోని 'గడ్డకట్టిన వెన్నెల'యిన తాజమహలుకూ, అంటు ప్రజలుగా ఘోషించే నానా జాతినగరం బొంబాయికి, రారమ్మని చేతులు జాచిన అజంతా కుడ్య చిత్రాలకూ, 'నేనే ఒకపుడు భీష్మాచార్యుల్ని సుమా' అంటున్న అడయారులోని మర్రిచెట్టుకూ, రాళ్ళూ రప్పలూ ప్రాణం పోసుకుని పలకరించే మహాబలిపురానికీ, జీవాత్మ పరమాత్మల అవినాభావసంబంధానికి తార్కాణంగా ఆకాశానంటుతున్న తంజావూరు బృహదీశ్వరాలయ గోపురానికీ, ముగ్గురు సాగర రాజకుమారులలో ఎవరి నెన్నుకోవాలో తెలియక తికమకలాడుతున్న కన్యాకుమారికీ శర్మ తనబాధను పంచిపెట్టాడు—మూడు నెలల సెలవు తర్వాత ఉద్యోగంలో చేరిన శర్మ మస్తిష్కంలో సంఘపు కొలతలకి విలువలు విప్లవకరంగా మారిపోయాయి

"—ఈ నాడు కేవలం తోటి మనిషిగా నమ్మి, అనురాగంతో తన్ను సినిమాకు రమ్మని పిలుస్తున్న ఈమె సంఘం దృష్టిలో ఎంత అనైతికమయిన పని చేస్తున్నదో..?"

శర్మ నిర్వికారంగా నవ్వాడు.

"ఏం శర్మా... నవ్వుతున్నావేం...?"

"అబ్బే... ఉత్తినే..."

"అదేమిటో బాబూ, నీ మాటలు చేష్టలూ నీకే అర్థం కావాలి. మరీ రోజులు గడచినకొద్దీ కొత్తవాడివయిపోతున్నట్లుంది." అంది ఉష.

సినిమా థియేటరులో ఇద్దరూ పక్కపక్కన కూచున్నారు. నవ్వుతున్నపుడు రెండు మూడు సార్లు ఆమె భుజం శర్మ భుజానికి తగిలింది. మసక వెల్తురులో శర్మ ఆమె మొహం పరికించాడు... ఆమె చూపులు తెర మీద వున్నాయి.

రాత్రి తొమ్మిదిన్నరకి సినిమా ముగిసింది. ఇద్దరూ బయటికి వచ్చారు. వర్షం ప్రారంభమయింది. ఉన్న రెండు బస్సుల్లోనూ ఖాళీ లేకపోయింది.

"ఆటోరిక్షాలో వెళదాం." అన్నాడు శర్మ.

"ఈ వర్షంలో ఒక 'ఆటో' దొరకడమే దుర్లభం. ఇపుడు మనకి రెండెక్కడ దొరుకుతాయి!"

"రెండెందుకూ...?"

శర్మ ఉషాదేవి కళ్ళల్లోకి చూశాడు. అతడి భావాల ప్రతిబింబాలు అందు కన్పించలేదు. కొన్ని ఘంటలసేపులో శర్మ తాను రెండుసార్లు ఓడిపోయానను కున్నాడు.

సిగరెట్ ప్యాకెట్ ఒకటి కొనుక్కుని శర్మ ఆటోరిక్షాలోకి ఉష ప్రక్కన కూచున్నాడు. ఉష డ్రైవరుకు అడ్రసు చెప్పింది. దారిపొడుగునా ఇద్దరూ మాటాడుకోలేదు. "యినా వీళ్ళేం భార్యా భర్తలూ!" అనుకున్నాడు ఆటోరిక్షావాలా.

ఇరవై నిమిషాల తర్వాత ఆటోరిక్షా, వాళ్ళింటి ముందు ఆగింది. ఆటోరిక్షాను పంపేసి శర్మ ఆఖరి సిగరెట్టు ముట్టించాడు.

—శర్మ బట్టలు మార్చుకున్నాడు. హోటలుకు బయలుదేరుతూండగా ఉష అడ్డొచ్చి "రాత్రి ఈ వేళకి భోజనం వుంటుందా?" అంది.

"లేకపోతే చపాతీ లున్నాయిగా?"

"ఏం అక్కర్లేదు. నేను అన్నం వండానుగా... ఆ ఉన్నదాన్ని చెరిసగం తిందాం రా..." అంది ఉష.

"ఊహు" అని వెళ్ళిపోయాడు శర్మ.

టిఫిన్ తిన్నాడు...సిగరెట్టు వెలిగించి ఇంటి వైపు నడవసాగాడు.

తనమీద తానే ప్రశ్నపత్రం ప్రయోగించుకుంటే కనీసపు ప్యాసుమార్కులయినా రాలేదు. శర్మ తిన్నగా మరో మిత్రుని గదికివెళ్ళి అక్కడ గడిపాడు ఆ రాత్రి.

మరునటిరోజు పొద్దున ఇంటికొచ్చేసరికి ఉషగదికి తాళం వేసివుంది. ఆఫీసుకి వెళ్తూవెళ్తూ ఉష బడివైపు వెళ్ళాడు. ఉష ఎవరితోనో మాట్లాడుతూ వుంది. ఆ ప్రక్కనే హెడ్‌మిస్ట్రెస్ కూడా వుంది.

"ఏం శర్మా, రాత్రి ఏమయిపోయావ్? నీకోసం పొద్దున ఎనిమిద్దాకా చూసిచూసి వచ్చేశాను. ఇవాళ బళ్ళో ఇన్స్పెక్షనుందీ...అందుకని త్వరగా రావాలసి వచ్చింది. ఇదుగో డి. ఇ. ఓ. సచ్చిదానందరావు... ఇతడు మా శర్మండీ." అని పరిచయం చేసింది. మగాళ్ళిద్దరూ హల్లో అని పలకరించుకున్నారు. హెడ్‌మిస్ట్రెస్‌తో శర్మకు పరిచితే. రెండు నిముషాలు ఏవేవో మాట్లాడింతర్వాత శర్మ వెళిపోయాడు.

ఆ రోజు ఆఫీసు అయిపోగానే శర్మ ఇంటి కొచ్చాడు...ఉష అతణ్ణి పలకరించింది.

"పొద్దున ఇన్స్పెక్షన్ వుందని నిన్న నాతో చెప్పలేదేం?" అని అడిగాడు శర్మ.

"గుర్తులేదు శర్మా!" అంది ఉష యథాలాపంగా.

"పోనీ వెళ్తూ వెళ్తూ ఓకాగితంముక్క రాసి తలుపు గొళ్ళానికి గుచ్చి వెళ్ళకూడదూ?"

"అవునవును...నీవుమాత్రం అన్నం తినకుండే తినకుండా ఎక్కడో ఏదో చెత్తతిని రాత్రెలా వేళాలు తిరిగి రావచ్చా... నేనేమో ఓగంటముందు వెళితే చీటి రాసి వెళ్ళాలి కదూ..." అని గలగలా నక్షత్రాలు విసిరినట్టు నవ్వింది.

శర్మా నవ్వేశాడు. నవ్వుతూ నవ్వుతూ గభుక్కున ఆగాడు ఉష అతడివైపు చూచింది...... ప్రశ్నార్థకంగా—

మరో రోజు పనుంది ఏడింటికల్లా అఫీసు కెళ్ళిపోయాడు శర్మ. తొమ్మిదింటికి ఫోనుమీద అతన్నెవరో పిలిచారు! "మీ ఉషా దేవిగారు హఠాత్తుగా క్రిందపడి పోయారు త్వరగా రండి" అనె నొక గొంతు...

పరుగెత్తుకొచ్చాడు శర్మ. ఇంటిలోంచి బయటికి వస్తున్న డాక్టర్ ఎదురయ్యాడు..."ఉషగారి 'రిలేటెడ్'—మీరేనా?"

"ఔను...ఆమె ఏమయిందీ?"

"అబ్బే ఏమీ కాలేదు..." ఎక్సెస్ లాస్ ఆఫ్ బ్లడ్ వల్ల 'ఎనిమియా'నూ తద్వారా 'కంప్లీట్ డెబిలిటీ'నూ. మరి వారంరోజుల్లో—'షి విల్ బి ఆల్ రైట్'" అన్నాడు డాక్టర్.

"ప్రాణభయం ఏమయినా..."

"అబ్బే అటువంటిదేమీ లేదు...ఆపిల్ పళ్ళరసం, హార్లిక్స్ నేను వ్రాసిచ్చిన టానిక్...అన్నిటికన్న విశ్రాంతి...ఇవ్వండి. 'అర్జెన్సీ' ఫీలయితే నన్ను పిలవండి"—అని వెళిపోయాడు.

శర్మ ఉషగదిలో కెళ్ళాడు. అతణ్ణిచూసి అంతవరకూ ఉషను చూచుకున్న ప్రక్కింటావిడ... "ఇదుగో నాయనా...ఇప్పుడే కాస్త కళ్ళుతెరిచి చూచింది. డాక్టర్ గారు ఇంజక్షన్ ఇచ్చి టానిక్ రాసిచ్చి వెళ్ళారు..." అని చెప్పి వెళిపోయింది.

బలహీనంగా, కళ్ళు మూసుకుని, చిరుచెమటకు తడిసిన మొహంమీద నల్లటి వెంట్రుకలు ఆడుకుంటుండగా రెండుచేతులూ రొమ్ముమీద ఆనించుకుని మగతగా మంచంమీద పడుకుని వున్న ఉషను శర్మ చూశాడు.

ఐదునిముషాలు గడిచాయి.

దగ్గరకెళ్ళి మంచప్రక్కన మోకాళ్ళమీద కూర్చున్నాడు. నెమ్మదిగా ఆమె తలవెంట్రుకల్ని దువ్వుతూ..."ఎలా వుందండీ?" అన్నాడు.

కళ్లు తెరచి చూసింది ఉష. ఆమె కళ్లల్లోకి చూశాడు శర్మ. "ఎందుకొచ్చావ్ శర్మా...ఆఫీసు లేదూ?" అంది ఉష బలహీనంగా, చిరునవ్వుతో.

"మీ కిలా వుందని ఫోన్ వస్తే..."

"హు...ఇందుకు నువ్వు ఆఫీసొదలి రావడమా-? పిచ్చివాడివి. నాకేమీ ఫరవా లేదు..." అంది ఉష అతడి చేతిని తన చేతిలోకి తీసుకుని నిమురుతూ... ఆక్షణాన పాపాయిగా మారిపోయి ఆ అనురాగపు వెచ్చదనంలో ఇమిడిపోవాలనుకున్నాడు శర్మ.

శర్మ ఏమీ మాట్లాడకుండా తనవైపే చూస్తుండడం గమనించిన ఉష గోడవైపు చూస్తూ... "నిజంగానే నాకేమీ లేదు శర్మా" అంది.

శర్మ గభుక్కున లేచి నిల్చున్నాడు. "మీకేమీ లేకపోతు నాపరే—ఉన్నా, సరే, ఈ వారం రోజులూ మీరు కదలడానికి వీల్లేదు. పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి."

"బడి కెళ్లొద్దూ?"

"బడికి సెలవు పెట్టివేయండి. నేను హెడ్ మిస్ట్రెస్‌తో మాట్లాడుతాను."

"ఎందుకూ అనవసరంగా సెలవు పెట్టడం?"

"అనవసరం అన్నది మీ కక్కర్లేదు. నోర్మూసుకుని నే చెప్పినట్లు వినండి. తెలిసిందా? స్నానం వగైరా చేయకండి. ఇటూ అటూ తిరక్కండి. పండ్లూ, పాలూ, టానిక్కూ పుచ్చుకోండి..." అని శర్మ ఉత్తర్వులు జారీచేసి పారేస్తూంటే, ప్రతిఘటించే ఓపిక లేక ఉష ఒక కొత్తనవ్వు నవ్వింది.

ఆ రోజు సాయంకాలం అయ్యగారు పంపారంటూ ఒక పనిమనిషి ప్రత్యక్షమయింది. రాత్రి ఉష ప్రక్కన టేబిలు మీదికి ఆపిలుపళ్ళూ, బత్తాయిపళ్ళూ, హార్లిక్సూ, ఓవ్లానూ, టానిక్కు సీసా వగైరాలు తయారయ్యాయి.

"నాకోసమని ఇలా డబ్బు ఖర్చుపెడుతున్నావా శర్మా? ఆ డ్రాయర్ లో నా పర్సుంది...తీసుకుని—"

"స్...నోరుమూసుకుని పడుకోండి." అన్నాడు హార్లిక్స్ కలుపుతున్న శర్మ.

ఆమెకు హార్లిక్స్ ఇచ్చాడు. "నాకెందుకు ఈ సేవింతకీ?" అంది ఉష.

శర్మ మొహం చూచి... "అబ్బే అది కాదు శర్మా...నీవూ ఓగ్లాసు కలుపుకోకూడదూ?" అంది.

"నాకేమీ 'అనీమియా' రాలేదు." అంటూ శర్మ తనగదిలోకి వెళ్లిపోయాడు.

"మరీ ఇలా తయారవుతున్నాడే—" అనుకుంది ఉష.

వారంరోజుల తర్వాత ఉషాదేవి పూర్తిగా తేరుకుంది. మామూలుగా బడికి వెళ్లడం మొదలిడింది. శర్మ రొమ్ము విరుచుకు తిరగసాగాడు. ఆవారంరోజులపాటు రోజూ—బీచికి తీసుకెళ్లి ఆమెకు అవీ ఇవీ కథలూ కబుర్లూ చెప్పేవాడు. ఒకరోజు తన ఆఫీసుకు తీసికెళ్లాడు. తన స్థలమూ, అవీ చూపించాడు ప్రెస్సు ఎలా పనిచేస్తూందీ అనీ వివరించి చెప్పాడు. ఉష జీవితంలో ప్రతి రోజూ ఒక మైలురాయిగా నిలిచిపోసాగాడు.

ఆఫీసులో అసిస్టెంటు ఎడిటర్ నరసింహారావుగారు ఎప్పుడూ శర్మంటే చనువుగా వుండేవాడు. ఒకరోజు ఆయన ఇలా అడిగారు. "ఏం శర్మా పెళ్ళెపుడూ?"

శర్మ నవ్వి ఊరుకున్నాడు.

"అదిగో దబ్బాయ్...నీవు 'ఊ' అంటే పెద్దాపురంలో..."

"అబ్బెబ్బె-ఇంకా ఆ మాటే అనుకోలేదండీ."

"మరయితే శర్మా! ఒకటడుగుతా గాని—ఏమీ అనుకోవు గదా?"

శర్మ కనుబొమలు చిట్లించి చూశాడు.

"నీవు ఎవరితోనో వుంటున్నావుటగా?"

శర్మకి కోపం వచ్చింది. అసిస్టెంట్ ఎడిటర్ మీద కాదు, 'వీర'ని చూపలేని వారిమీద. కాని మహాశాంతంగా "కానీండి" అన్నాడు.

"ఆ అమ్మాయి మనవాళ్ళదేనా?"

"తెలీదండి."

"ఆ అమ్మాయీ నీవూ..."

"—కలిసి ఒకే ఆటోరిక్షాలో కూచుంటాం. సినిమాల కెళతాం. బీచి ఒడ్డున కూచుంటూ...కబుర్లు చెప్పుకుంటాం...నవ్వుకుంటాం."

"అది కాదు శర్మా—"

"నరసింహారావుగారూ నేను ఎవరికీ సంజాయిషీ చెప్పాల్సిన అవసరం లేదు. కాని తండ్రివంటివారు గనుక మీతో చెబుతున్నా. ఆమె నాతో కలిసి మెలిసి వుంటుంది. అంతే. మీరు నమ్మినా నమ్మకపోయినా యదార్థం అదీ. మీరనుకుంటున్న అవసరమే వచ్చి ఇద్దరమూ పెళ్ళాడదలచుకుంటే— మీరూ, మీ సంఘమూ కలిసి చేయగలిగేదేమీ లేదని తెలుసుకోండి—"అని శర్మ చరచర లేచి వెళ్ళాడు.

బీచిలో ఇసుకతిప్పమీద పొర్లాడినంతసేపూ ఉత్తర దక్షిణ ధ్రువాల్లాటి ఆలోచనలతనిలో ఘర్షిం

చాయి. కాసేపు, తను నరసింహారావుగారి వద్ద దురుసుగా ప్రవర్తించానేమో అని బాధపడ్డాడు. ప్రొహిబిషన్ తట్టుకున్నాడు. మూడో నిముషం...మళ్ళీ ఆలోచన రాబోతుంటే బ్రహ్మప్రయత్నంతో మెదడుని శూన్యం చేసుకున్నాడు.

—ఒకరోజు—ఎవరో మంత్రిని ఇంటర్వ్యూ చేయాలని శర్మ పొద్దునే వెళ్ళిపోయాడు. ఆ పని పూర్తి చేసుకొని వెనక్కి తిరిగేసరికి ఒంటిగంట అయింది. ఏదయినా తిందామని దారిలో వున్న 'కైలాస్' కేఫ్‌లో దూరాడు శర్మ.

చెమటని రుమాలుతో తుడుచుకుంటూ ఒక కుర్చీలో కూలబడ్డాడు. సర్వీస్ కోసం చూస్తూంటేగా హఠాత్తుగా ఉషాదేవి అతడికంటబడింది!

ఓమూల టేబిలదగ్గర కూచుని ఏదో తింటూంది. శర్మ ఆశ్చర్యంతో నిండిపోయాడు. ఆమె బడికీ ఇక్కడికీ మైలు దూరముంది. "ఇటీవలే జబ్బుపడి లేచింది కదా. ఈ యెండలో ఇంతదూరం ఎందుకొచ్చిందీ బుద్ధిలేని మనిషి—" అనుకున్నాడు శర్మ.

అతడి దృష్టి కాస్త జరిగింది. ఉషకి ఎదుట నోటితో ఆరంజిక్రష్‌నూ, కళ్ళతో ఆమెనూ తాగుతున్న డి. ఇ. ఓ. సచ్చిదానందరావ్ కన్పించాడు.

శర్మ హోటలునుండి బయటికొచ్చేశాడు— "ఏం కావాలన్నా అంటుంటే పట్టుకోండా లేచిపోతాడేం—ఈ మానవుడూ! అయినా ఈ మహాపట్నం. ఇదీ వింత ప్రకృతీ—" అనుకున్నాడు సర్వగ్.

శర్మ ఇంటికెళ్ళి పడుకున్నాడు. నిద్దుకోలేకపోయాడు. బీచికి వెళ్ళి జనసంచారం లేనిచోట కూచున్నాడు. అలలహోరులో జనఘోష కొంతకలిసిపోయినట్లనిపించింది. దీపాలు పెట్టే వేళకు ఇల్లుచేరుకున్నాడు.

గుమ్మంలోనే ఉష చిరునవ్వుతో పలకరించింది: "అలా వున్నావేం?"

"ఎలా వున్నానూ?"

"పరీక్షలో ఫెయిలయిన అబ్బాయిలా!"

"నేను ఫెయిలయింది—పరీక్షలో కాదు" అని ఆమెను దాటి వెళ్ళిపోయాడు శర్మ. గదిలో పడకకుర్చీ మీద కళ్ళుమూసుకుని పడుకున్నాడు.

కాసేపటికి చేతిలో గులాబ్‌జాములున్న ప్లేటుతో వచ్చింది ఉష.

"ఇవి తిను శర్మా!"

శర్మ కళ్ళు తెరచి చూశాడు.

"ఇవాళ మా హెడ్‌మిస్ట్రెస్ గారి అమ్మాయి పుట్టినరోజట. అందుకని నన్ను ఇంటికి తీసుకెళ్ళి ఇవన్నీ పెట్టి పంపింది. నేనంటే ఆమెకు ఎంత ఇష్టమని!" అంది ఉష.

"మీరంటే చాలామందికి ఇష్టం" అన్నాడు శర్మ. కాని అతడనుకున్నట్టు తగలలేదు బాణం.

"అందులో మా శర్మాజీ మొదటివాడు."

"మొ...ద...టి...వా...డు" అని గొణుక్కున్నాడు శర్మ.

"ఏమిటది?"

"అబ్బే ఏమీ లేదు."

"ఇవి తిను."

"మీరు తినకూడదూ?"

"నేను తిన్నాను. నా కాకలి లేదు."

"నాకూ లేదు."

"అయితే తినవా మరి?"

"పోనీలే! రేపొద్దున్న ఆఫీసుకెళ్ళేముందు..."

"ఊహు వీటిని నేనిప్పుడూ తినను."

"ఏం!"

"నాకు గులాబ్‌జాములు సహించవు—మీరు వెళ్ళి పడుకోండి."

ఆ అబద్ధం ఉషకి లెంపకాయిలా తగిలింది. ఆమె అక్కడినుంచి వెళ్ళిపోయింది. ఆ రాత్రి ఆమె దిండు తప్ప తడిసింది.

శర్మ ఏడవాలనుకున్నాడు కాని ఏడ్పురాలేదు.

—జనవరి వచ్చింది. బళ్ళు మూసేయడానికి ఇంకా రెండు మాసాలే వున్నాయి.

ఒకరోజు సాయంకాలం ఉష—"శర్మా నీవు రేపూ ఎల్లుండీ సెలవుపెడతావా?" అంది అతడి ప్రక్కన కుర్చీలో కూర్చుంటూ.

"ఎందుకూ?"

"బళ్ళో టీచర్లమందరమూ తిరుపతికి పిక్‌నిక్ వెడుతున్నాం. నీవు రావాలని..."

"మీ పంతులమ్మలతో నేనెందుకూ?" అన్నాడు శర్మ నవ్వుతూ.

"మాతో బాటు రావుగారొస్తున్నారుగా. ఆయనతో బాటు నువ్వూను—"

"రావుగారా?"

"ఆయనే... డి. ఇ. ఓ. సచ్చిదానందరావుగారు..."

"ఆయన మీతో రావడమెందుకూ?" శర్మ స్వరంలోని మార్పు ఉష గుర్తించలేదు.

"ఈ పిక్‌నిక్ ఏర్పాటు చేసింది ఆయనే, రేపు పొద్దునే ఆయనే రెండు కార్లు తీసుకొస్తారు."

"ఓహో—"

"అందుచేత నీవు వస్తే—ఎంతో"

"నేను రాను. మీరు వెళ్ళిరండి."

"ఏం?"

"ఇంకో ముఖ్యమయిన పనుంది."

"ఆ పని రెండురోజులు ఆగలేదూ?"

"అబ్బే—వీల్లేదు. రేపు నేనిక్కడ వుండితీరాలి."

"నివ్వూవస్తే సరదాగా—"

"నేను రాకపోతేమాత్రం ఏం, సరదాగా వుండలేరూ—?"

"శర్మా...అలా మాట్లాడుతున్నావేం?" అని అక్కడినుంచి లేచి వెళ్ళిపోయింది ఉష

ఆమె వలాగే కాసేపు చూసి, లేచి నిల్చున్నాడు శర్మ. చేతిలో ఇంకా ఆయిర్దాయమున్న సిగరెటుని క్రిందపడేసి పాదంతో బలంగా రాచాడు. 'చుర్' మంది. కాని శర్మకు ఫీలింగ్ తట్టలేదు!

మూడోరోజు మధ్యాహ్నం ఉషాదేవి తిరుపతి నుంచి వచ్చింది. శర్మ మామూలుగా ప్రవర్తించడం చూచి సంతోషపడింది. ఒకవారం తర్వాత ఓసాయంకాలం ఉష శర్మచేతికోక పెద్ద ఫోటోనిచ్చింది.

"ఇదిగో—ఆ మూల నిల్చున్నదే ప్రక్క వీధిలో వుంటుందని చెప్పానే శారద—ఇటుప్రక్క విజయలక్ష్మి. ఎం. ఏ. బి. టి. సరే ఈయన్ని నీ వెరుగుదువు గదా. డి. ఇ. ఒ. రావుగారు. ఆయనప్రక్కనే నేను. అవతలేమో హెడ్ మిస్ట్రెస్సూ. ఈ మూల మా సంగీతం టీచరు మంగళాదేవి..."

శర్మ గభుక్కున ఫోటోను ఆమెచేతి కిచ్చేవాడు. "చాలా బావుంది" అన్నాడు.

"నిజంగానా—"అని అడిగింది ఉష.

"అవును."

"నే నెలా వున్నాను?"

"ఎప్పటికన్నా ఇంకా చక్కగా వున్నారు."

"ఫో శర్మా! ఎప్పుడూ ఎగతాళే—" అని ఉష గలగలా నవ్వింది.

మొట్టమొదటిసారిగా శర్మ ఆమె నవ్వుని ఆనందించలేకపోయాడు.

—రిపబ్లిక్ డేకు ముందురోజు.

"శర్మా! రేపుప్రొద్దున పెరేడ్‌కి వెళదామా" అని అడిగింది ఉష.

"పెరేడ్లంటే విసుగెత్తింది. అయినా ఆ ఎండలో ఎవరు మాడుతారు?"

"మాడ్డం దేనికీ? 'స్పెషల్ ఎన్‌క్లోజర్'లో కూచుందాం." అంది ఉష.

"మనమేం మంత్రులమా లేక నాయకమ్మన్యుల మానసపుత్రులమా?"

"ఆ రెండూ కాము... అయినా మనకోసం మూడు సీట్లు సిద్ధంగా వుంటాయక్కడ." అంది గర్వంతో కూడిన నవ్వుతో—ఉష.

"ముగ్గురెవరూ?"

"నీవూ, నేనూ, రావుగారూ—"

"రా-వు-గా-రా?"

"అవును—ఆయనే. పొద్దున కారు తెస్తానని, నన్ను రమ్మనీ అన్నారు. నీవు వస్తావని చెప్పాను."

"ఆయన భార్యా బిడ్డల్ని తీసుకెళ్ళడేమిటి?"

"ఆయన భార్య చనిపోయి ఏడాదయిందట. కొడుకు కోడైకెనాల్‌లో చదువుతున్నాట్ట. అయినా ఆ గొడవంతా ఎందుగ్గానీ - నీవు ఆరింటికే లేవాలి రేపొద్దున."

"ఊహు... నేను రాలేను. నేను 'ఫోర్ట్'కు వెళ్ళాలి పొద్దున్నే."

"అవునవును. నే నెప్పుడు పిలిచినా నీకేదో అడ్డం వస్తుంటుంది." అంది ఉష మొహం ముడుచుకుంటూ.

"మీరు వెళ్ళిరండి—హాయిగా."

"హా...యి...గా...హుం" అని ఉష తన గదిలోకి వెళ్ళిపోయింది.

శర్మ బయటికెళ్ళి వచ్చాడు. భోజనం చేయకుండానే పడుకున్నాడు. పన్నెండయినా అతడికి నిద్రపట్టలేదు. ఉష గదిలోనుంచి వెక్కిళ్ళ శబ్దం వినిపించింది. కొన్ని యుగాలసేపు అది వినహా మరో శబ్దం శర్మ చెవుల కందలేదు. తటాలున శర్మ లేచి కూచున్నాడు. స్విచ్చి నొక్కాడు. తన గది బయటకడుగు వేశాడు. హఠాత్తుగా వెనక్కు తిరిగి లోపలికొచ్చి పక్కమీదికి వాలిపోయాడు. బాగా నిద్రపట్టింది. తెల్లవారుఝామున నాల్గింటికి ఉష తన గది బయటికొచ్చింది. శర్మ గదిలో లైటు వెల్గుతుండటం చూసింది. తిన్నగా అతని గదిలోకొచ్చి లైటార్పేసి తన గదిలోకి వెళ్ళిపోయింది.

పొద్దున ఏడింటికి శర్మకు మెలకువ వచ్చింది. ఉష తన గదిలోనే వుండటం గ్రహించాడు. తానూ గదిలోనుంచి బయటకు రాలేదు.

కాస్సేపటికి ఇంటిముందు కారాగిన చప్పుడయింది. బూట్లశబ్దం లోపలికి వచ్చింది.

"ఉషాదేవి!"

"ఓ! రావుగారా...రండి..."

"ఇంకా డ్రెస్ చేసుకోలేదే?"

"తల నొప్పిగా వుందండీ—"

"అరెరె..."

"ఇవాళ్టికి మీరు క్షమించాలి. పెరేడుకు నేను రాలేను."

"అబ్బే, ఏమీ పరవాలేదు. నెవర్ మైండ్... పోనీ అలా కారులో అడయారువాక వెళ్లొద్దాం... కాస్త చల్ల గాలి తగిలితే మీ తలనొప్పి తగ్గుతుందేమో"

"అబ్బే... అక్కర్లేదండీ... దానంతటది అదే—"

"మైగాడ్! మీ కళ్ళు ఎర్రగా వున్నాయే—"

"ఏమీ లేదండీ... ఏదో కాస్త..." అని అనునయంగా సమాధానమిస్తున్న ఉష స్వరం శర్మని తేలులా కుట్టింది. శర్మ లేచి తొందర తొందరగా మొహం కడుక్కొని బట్టలు తొడుక్కొని బయటికి వెళిపోయాడు—ఉష గది వేపయినా చూడకుండా. ఆ గదిలో రావూ, ఉషా మాట్లాడుకుంటూనే వున్నారు

ఆ రోజు మధ్యాహ్నం మూడింటికి శర్మ ఇంటికి వచ్చాడు. ఉష గదికి తాళం వేసి వుంది. తన గదిలో కెళ్ళి పుస్తకాలూ, ఫోటోలూ, బట్టలూ రెండు పెట్టెల్లోకి సర్దేశాడు. కుర్చీలు రెండింటినీ మడిచికట్టాడు. రేడియోను అట్టపెట్టెలో వుంచాడు. ఇంతలో ఉష వచ్చింది.

"పొద్దున ఎక్కడికెళ్ళావ్ శర్మా?"

ఆ ప్రశ్న ఉష నడుగుదామని ఊర్కొంటే పోయాడు శర్మ.

"బయట టాక్సీ వుంది... ఎవరొచ్చారు శర్మా?"

"ఎవరూ రాలేదు... కాస్త దారి తీస్తారా?" అని శర్మ రెండు చేతుల్లోనూ పెట్టెలతో బయలుదేరాడు.

వేయి పిడుగుల కింద నలిగిపోయింది ఉష. "ఎక్కడికి శర్మా—?" పెట్టెల్నీ, మడత కుర్చీలనూ కారు వెనకాల వుంచేసి, రేడియోవున్న పెట్టెను కారు వెనక సీటు మీద వుంచాడు శర్మ. టాక్సీలో ఒక కాలుంచి వెనక్కు తిరిగి చూచాడు. గుమ్మంలో ఉష నిలబడివుంది

శర్మ మొహాన్ని మరో వైపుకు తిప్పుకుని— "నేను టి. నగర్‌లో మరో ఫ్రెండ్‌తో బాటు వుండబోతున్నాను. మీరు జాగ్రత్తగా... సుఖంగా వుండండి..." అన్నాడు.

"మం-చి-ది." అనగల్గింది ఉష.

ఇంకా ఆమె ఏం చెబుతుందోనని ఎదురుచూచిన శర్మ దాదాపు నిముషం తర్వాత వెనక్కు తిరిగిచూస్తే గుమ్మంలో ఉష లేదు.

టాక్సీ బయలు దేరింది.

ఉష మూడురోజుల దాక బయటికి రాలేదు.

ఆరు వారాల తర్వాత శర్మ చైనాబజారులో బనియన్లు కొంటున్నాడు.

"అవెల్లాం ఇల్లేసార్ — ఒరేంజ్ ఒణ్ణు కొల్లూలా"

"ఒకరూ బాదాం తగా వేం..." అంటున్నాడు శర్మ.

"శర్మా!"—ఉష కన్పించింది! ఎవరో అపరిచిత వ్యక్తిని చూసినట్లు చూశాడు ఒక్క క్షణం.

"కులాసాగా వున్నారా? వస్తా, పనుంది—" అని బనియన్లు కొనడం మానేసి అడుగు ముందుకు వేశాడు శర్మ..

ఉష నవ్వింది; మునుపటి నవ్వు కాదు. "శర్మా.. వెళ్ళిపోతున్నావా?—పోనీ కాస్త మాట్లాడాలి..." అని అతడి ప్రక్కకు చేరేసరికి అతడు వేగంగా నడవసాగాడు.

ఆమె అతడితో బాటు నడవడానికి ప్రయత్నిస్తూ "శర్మా... దేహాన్ని చంపడంకంటే మనసుని చంపడం క్రూరం కదూ?" అంది.

శర్మ తన వేగాన్ని హెచ్చిస్తూ... "క్షమించండి... నాకేమీ తెలియదు..."

"తెలియనిది నీకొక్కడికే; నాకు... శర్మా... నీ ఇష్టమే నా—"—ఆ రద్దీలో ఉషపాదాన్ని ఒక బూటు తొక్కింది... 'అమ్మా' అని కేక పెట్టిన ఉష ప్రక్కకు చూసేసరికి శర్మలాంటి తలకాయలు వందలూ, వేలూ కన్పించాయి.

"హుం" అనుకున్న అప్పటి ఉషకూ—మొట్ట మొదటి బీచిలో శర్మ చూసిన ఉషకూ, చాల కొద్ది తేడామాత్రమే వుంది.

పదిరోజు లయింది.

శర్మ ఆఫీసుముందొక కారు ఆగింది. ఉషాదేవి దిగింది. ఆమె వెనకాలే పచ్చి నాసంరావు దిగాడు.

"త్వరగా రా ఉషా" అన్నాడతడు—ఆమె చేతిలోని గులాబీని తీసుకొంటూ.

పదినిముషాల తర్వాత ఉష ఆఫీసునుంచి బయటికి వచ్చింది. ఆమె మొహం వాతపోసినట్లుంది. కారు పక్కన నిల్చున్న రావు చేతిలోని గులాబిని పారేసి, "ఇచ్చి వేసెన్ ఇచ్చావా డియర్?" అంటూ ఆమెను చేత్తో పట్టుకుని కారులో ముందుసీటులో కూచోబెట్టాడు.

"లేదు ఇవ్వలేదు. తానింక ఈ ఉద్యోగం చేయదల్చుకోలేదంటూ రెసిగ్నేషన్ లెటర్ పంపాట్ట— అక్కడెక్కడో, జబల్‌పూర్ నుంచి!" అంది కారులో కూచున్న ఉష. ఆమె ప్రక్కన కూచున్నాడు రావు.

"నేను చెప్పలేదూ వాడుత్త సెంటిమెంటల్ ఫూల్ నీ—" అన్నాడు రావు కారు తలుపు మూస్తూ.

"హుం..." అని నవ్వింది ఉష.

కారు ఒక్క ఊపుతో బయలుదేరింది.

రావుగారి చేతుల్లో ఒకటి స్టీరింగుమీదా, మరొకటి ఉషాదేవి భుజంమీదా వున్నాయి.

రోడ్డుమీది గులాబీపూవు కారుచక్రం క్రింద నలిగింది.